RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ మంగళవారం 4-8- 2026 సంపుటి : 6 సంచిక : 176 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే




- భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష
- సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

## కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణం
- చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం
- అసమ్మతి నేతల ఆందోళనలు..ధర్నాలు ఎమ్మెల్యే
- యశ్వంతరాయ గౌడ పాటీల్ రాజీనామా




బెంగళూరు,**అభ్యుదయం**

:కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత
- రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల పక్రియ పూర్తి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి
- తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి



హైదరాబాద్,**అభ్యుదయం**

రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే పక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా

మిగతా 2లో

## ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ వినియోగం లెక్కలు తేల్చాలి



- కోవిడ్ -19 తర్వాత భారీగా పెరిగిన ఆక్సిజన్ కొనుగోలు
- పలు కారణాలతో రూ.105 కోట్లతో నిర్మితమై, నిరుపయోగంగా ఉన్న 161 పీఎస్ఏ ప్లాంట్లు
- మంత్రి సత్యకుమార్ యాదవ్

## రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు

నిమ్స్ వైద్య బృందానికి సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు




హైదరాబాద్,**అభ్యుదయం**

నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు.

## నా విద్యార్హతలు రుణాలు తెరిచిన కాగితం



- బోస్టన్ వర్సిటీలో చదవడంపై వారికెందుకంత కచ్చ
- బిజెపి నేతలు కూడా వారి విద్యార్హతలు తెలిపితే మంచిది
- ఆర్‌టిఐ ద్వారా సమాచార ప్రశ్నకు అభిజిత్ దీప్కే ఘాటు స్పందన

2లో

## కాంగ్రెస్ నేతల దిగజారుడు విమర్శలు

హరీష్ రావుపై క్షుద్రపూజల ఆరోపణలు దుర్మార్గం

రేవంత్ కూడా ఇలాగే పూజలు చేస్తున్నారేమో

మండిపడ్డ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్




హైదరాబాద్,**అభ్యుదయం**

తెలంగాణ భవన్ ఉద్యమాల వేదిక ..పోరాటానికి ప్రతిరూపమైన వేదిక.. కుక్క కాటుకు చెప్పు దెబ్బ అనే కాంగ్రెస్ నేతల పిచ్చి ఆరోపణలకు కూడా సమాధానం చెప్పాల్సి వస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ పిచ్చోడికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని కేసీఆర్ అంటుంటారు. కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలు అంటూ హరీశ్ రావు మీద వ్యక్తిత్వ హననానికి పాల్పడు తున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన విలువలను కించపరచడమే.. కాంగ్రెస్ నేతలు అత్యంత నీచానికి పాల్పడు తున్నారు.. కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెట్టినట్టుగా రేవంత్ హయాంలో గాంధీ భవన్‌ను బూతుల అడ్డాగా మార్చారు. గాంధీ వచ్చి కూర్చున్న భవన్‌ను

మిగతా 2లో

## నిమ్స్‌లో వెయ్యి రొబోటిక్ సర్జరీలు

డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన మంత్రి దామోదర



హైదరాబాద్,**అభ్యుదయం**

నిమ్స్ హాస్పిటల్ మరో ఘనతను సాధించింది. రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే నిమ్స్ హాస్పిటల్‌లో 1,000 రొబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసిన డాక్టర్ రాహుల్ దేవరాజ్, నిమ్స్ సాధించిన ఈ ఘనతను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్‌తో పాటు రొబోటిక్ సర్జరీల్లో భాగస్వాములైన డాక్టర్లు, నర్సింగ్

మిగతా 2లో



## వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు
- అన్ని శాఖల అధికారులను ఆదేశించిన సిఎస్



## సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు

- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం
- పెండింగ్ కేసుల పరిష్కారానికి అవకాశం

మిగతా 2లో

# ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ వినియోగం లెక్కలు తేల్చాలి

అమరావతి, కోవిడ్-19 నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ సరఫరా కోసం దాదాపు రూ.105 కోట్లతో నిర్మితమై నిరుపయోగంగా మారిన పీఎస్ఏ (ప్రెషర్ స్వింగ్ అడ్సార్పషన్) ప్లాంట్లు, అధిక మోతాదులో ఎల్ఎంఓ (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) కొనుగోళ్ల విషయాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం మంగళగిరి ఏపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఎల్ఎంఓ కొనుగోళ్లకు సంబంధించి, వాస్తవ డిమాండ్, సరఫరా విషయాలపై రెండు వారాల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించి, లోపాల గుర్తింపు, సవరణ చర్యలను చేపట్టి, ఆమేరకు ఎనిమిది ప్రభుత్వాసుపత్రుల్లో రెండు నెలలపాటు అమలుపరిచి అక్టోబరు 15 లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తద్వారా ఎల్ఎంఓ డిమాండ్, సరఫరాలోని వ్యత్యాసాన్ని గుర్తించి ఆక్సిజన్ కొనుగోలు ఖర్చును వీలైనంత వరకు కొవిడ్-19 పూర్వ స్థితికి తీసుకురావాలని మంత్రి స్పష్టంచేశారు.

**భారీగా పెరిగిన ఆక్సిజన్ కొనుగోలు వ్యయం..**

కోవిడ్-19 తీవ్రంగా ఉన్న 2020-21, 2021-22 సంవత్సరాల్లో రూ.95.43 కోట్ల మేరకు బోధనాసుపత్రుల్లో ఎల్ఏశీఓ కొనుగోలు చేశారు. కోవిడ్-19కు ముందు 2016-20 మధ్య కాలంలో (నాలుగేళ్లు) రూ.60.51 కోట్ల మేరకు వ్యయం చేశారు. కొవిడ్ అనంతరం 2022-26 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎల్ఎంఓ కొనుగోలు వ్యయం రూ.180.82 కోట్లకు చేరిందని మంత్రి సమీక్షా సమావేశంలో గుర్తించారు. గత నాలుగేళ్లలో కొత్త బోధనాసుపత్రులు, కొత్త ఆసుపత్రులు ఉనికిలోకి రావడం, పడకలు పెరగడం పెరుగుదలకు కొంతమేరకు కారణమైనప్పటికీ అధికారులు వివరించిన ఆక్సిజన్ డిమాండ్, వాస్తవ సరఫరాకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని, దీనిపై లోతుగా పరిశీలించి కొనుగోలు వ్యయాన్ని తగ్గించే దిశగా అవకాశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఈ పరిశీలనకు అనంతపురం బోధనాసుపత్రి (సూపర్ స్పెషాలిటీతో సహా), గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం బోధనాసుపత్రులతోపాటు రెండు జిల్లా, రెండు ఏరియా ఆసుపత్రులను ఎంపిక చేశారు. ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న 'పాత్' సంస్థ ఈ అధ్యయనాన్ని చేపడుతుంది.

# కర్ణాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు.

అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు.

# నా విద్యార్హతలు...రుణాలు తెరిచిన కాగితం

ముంబై,ఆగస్ట్3 బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హతల వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్‌టిఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికేం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై విచారణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

# సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

న్యూఢిల్లీ,ఆగస్ట్3: సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది.

## వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



హైదరాబాద్,ఆగస్ట్3స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, దేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణీ మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు.

## నిమ్స్‌లో వెయ్యి రొబోటిక్ సర్జరీలు

ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఇటీవలే నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తవడం, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని మంత్రి అన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ఎ÷-లాంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోనే ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో కూడా రొబోటిక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ హాస్పిటళ్లతో పాటు గాంధీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్‌లోనూ అత్యాధునిక రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేసి, ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు.

ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంత రంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయ స్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు.

## కాంగ్రెస్ నేతల దిగజారుడు విమర్శలు

అపవిత్రంగా మార్చారన్నారు. సెక్యులరిజం భావనను కాంగ్రెస్ నేతలు అపహాస్యం చేస్తున్నారు. హరీష్ రావు క్షుద్ర పూజలు చేశారు అని అసత్యపు ప్రచారం చేస్తున్నారు. హిందువులను అగౌరవ పరుస్తున్నారు.. శివతత్వాన్ని అవమాన పరుస్తున్నారని దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ మేలు కోసం కేసీఆర్ చండీ యాగం చేశారు. ప్రజలు చెడిపోవడం కోసం పూజలు ఎన్నడూ చేయలేదు. ఎన్టీఆర్ మీద కూడా శవపూజ చేశారని ఇలాంటి వారే దుష్ప్రచారం చేశారు. హరీశ్ రావు అనేక అంశాల మీద ప్రభుత్వం పై పోరాడుతున్నారు. అందుకే హరీష్ రావు మీద కక్ష గట్టి అడ్డమైన ఆరోపణలు చేస్తున్నారు. హరీష్ రావు శివమొగ్గ ముఖంబికా ఆలయాన్ని సందర్శించుకుంటే క్షుద్ర పూజలు చేసినట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. ముఖాంభికా దేవి ఎవరు.. ? శక్తి స్వరూపిణి ..అమ్మ వారిని రాజకీయాలకు వాడుకుంటున్న కాంగ్రెస్ నేతల నోళ్లు పడిపోతాయని దాసోజు హెచ్చరించారు.రేవంత్ రెడ్డే అద్దంకి, సామ రామ్మోహన్ రెడ్డితో క్షుద్ర పూజలు అని మాట్లాడిస్తున్నారు. శివమొగ్గ ఆది శంకరాచార్యులు తిరగాడిన అత్యంత పవిత్ర ప్రాంతం.. తమిళనాడు సీఎం విజయ్ కాంగ్రెస్ తో ఉన్నారు.. ఆయన కూడా ముకాంబికా దేవాలయం వెళ్లారు.. విజయ్ కూడా క్షుద్ర పూజలు చేశారా ..? అని దాసోజు శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, సిద్దరామయ్య ,శివకుమార్ కూడా అనేక గుడులు తిరుగుతున్నారు.. రేవంత్ క్షుద్ర పూజలు చేశారు కనుకే 2034 దాకా సీఎం గా ఉంటానని అంటున్నారా ? ?హరీష్ రావు పై క్షుద్ర పూజల ఆరోపణలు చేసినందుకు రేవంత్ రెడ్డి ,మహేష్ కుమార్ గౌడ్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి దాసోజు డిమాండ్ చేశారు. తొండల భాష ,పేగుల భాష నుంచి క్షుద్ర పూజల స్థాయికి దిగజార్చారు. ప్రజలతోనే కాదు అమ్మ వారితో పెట్టుకున్నారు. ఇక వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. శాస్త్రీయ దృక్పథాన్ని మరిచి క్షుద్ర పూజలు అని చిల్లరమల్లర మాటలు మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు తమ పార్టీ స్థాయిని దిగజార్చారన్నారు.

## సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు

న్యూఢిల్లీ,ఆగస్ట్3 లోక్‌సభలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026 ఆమోదం పొందడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో దాదాపు లక్ష పెండింగ్ కేసులు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్క సంవత్సరంలో 65 వేల కేసులను డిస్పోజ్ చేస్తే.. 75 వేల కొత్త కేసులు నమోదవుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. దీంతో కేసుల విచారణను వేగవంతం చేయాలనే లక్ష్యంతోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని రఘునందన్ రావు చెప్పుకొచ్చారు.జడ్జిల సంఖ్య పెంపుతో కక్షిదారులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి జడ్జిల సంఖ్య పెంచారని తెలిపారు. దేశ ప్రజలకు వేగంగా న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ బిల్లులను కేంద్రం తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కేంద్రం రూ.7 వేల కోట్లు ఖర్చు చేసిందని ప్రశంసించారు. కొలిజియం విధానానికి వ్యతిరేకంగా సర్వీస్ కమిషన్ తీసుకురావాలని గతంలో ప్రయత్నం జరిగిందని, అయితే సుప్రీంకోర్టు దానిని కొట్టివేసిందని రఘునందన్ రావు గుర్తు చేశారు. కొలిజియంలో మరింత పారదర్శకత అవసరమని, అందుకోసం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అభిప్రాయంగా తాను భావిస్తున్నానని, వాటిని స్వాగతిస్తున్నట్లు రఘునందర్ రావు పేర్కొన్నారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily
మంగళవారం 4-8-2026

# మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

**- జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన**
**- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల**

హైదరాబాద్,ఆగస్ట్3 : ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు. ఈ క్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు జోగినిలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని మహంకాళి ఆలయంలోకి జోగినిలు ప్రవేశించారు. మహంకాళి ఆలయం ముందు జోగినిల ఆందోళనతో



ఆలస్యంగా రంగం కార్యక్రమం ప్రారంభమైంది. జోగినిల ఆందోళనతో అమ్మవారి ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. జోగినిలను చర్చలకు పిలిచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు మాట్లాడారు. ఆందోళనను విరమించాలని జోగినిలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## కోమటిరెడ్డి రాజకీయ వైరాగ్యం

**- ఆయన మాటలపై జిల్లా రాజకీయాల్లో చర్చ**
**-ఓటమి భయంతోనే ఈ వ్యాఖ్యలని బిఆర్ఎస్ విమర్శలు**



నల్లగొండ,ఆగస్ట్3 నల్లగొండ జిల్లా రాజకీయాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఆయన స్పందిస్తూ తన మనసులోని మాటను బహిరంగంగా వెల్లడిం చారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని నల్లగొండ ప్రజలు మాట ఇస్తేనే తాను పోటీ చేస్తానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల నుంచి అలాంటి గ్యారెంటీ లేదా హామీ లభించకపోతే తాను ఎన్నికల బరి నుంచి తప్పుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, రాబోయే ఎన్నికల్లో తాను స్వయంగా ప్రచారానికి రాకపోయినా, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సేవలను చూసి ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో చర్చగా మారాయి. అయితే ఓటమి భయంతోనే కోమటిరెడ్డి ముందే జాగ్రత్త పడుతున్నారని బిఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎలాగూ గెలవదని, మళ్లీ అధికారంలోకి రావడం కాదుకదా, ఒక్కో నేతకు డిపాజిట్లు కూడా దక్కవని వ్యాఖ్యానించారు. అయితే సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ తనకంటూ సొంత ఇల్లు లేదా అదనపు ఆస్తులేవీ లేవని ఈ సందర్భంగా కోమటిరెడ్డి తెలిపారు. తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే ఉంటున్నానని, కేవలం పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి మాత్రమే తనకు ఉందని వివరించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తన జీవితం పూర్తిగా ప్రజాసేవకే అంకితమని, స్వార్థ రాజకీయాలకు తాను దూరమని పునరుద్ఘాటించారు .ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్ఎల్బీసీ సొరంగం మార్గం ద్వారా రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. కంచనపల్లి గ్రామాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. దోమలపల్లి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామని తెలిపారు. మూడేళ్లు నల్గొండ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. వారానికి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## అసోంలో అమానవీయ ఘటన

గౌహతి,ఆగస్ట్3 అస్సాంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురై, అతి దారుణమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులే ఆమెను గుర్తించలేని స్థితిలో ఇంట్లో శవమై కనిపించిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అస్సాంలోని హైలాఖాండీ జిల్లాకు చెందిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. అయితే తన కజిన్‌తో గొడవ కారణంగా
తిరిగి ఇంటికి వచ్చేసింది. వేడుక అనంతరం వారు ఇంటికి వచ్చేసరికి తమ కుమార్తెను ఆ స్థితిలో చూసి హతాశులయ్యారు.
హత్య చేయడానికి ముందు తమ బిడ్డపై అత్యాచారం జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె తల, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైందని, వ్యక్తిగత అవయవాల్లోకి రాడ్డు చొప్పించారని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

**జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు--మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



హైదరాబాద్,ఆగస్ట్3 లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

- వైద్యరంగం బలోపేతం చేసే విధంగా చర్యలు
- అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్,ఆగస్ట్3 నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు.

అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## ఎపి రైతులకు ప్రభుత్వం శుభవార్త

**ఖరీఫ్ పంటల బీమా గడువు పొడిగింపు**



అమరావతి,ఆగస్ట్3 రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఖరీఫ్ పంటల బీమా గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు స్పష్టం చేసింది. జులై 31వ తేదీతో ముగియాల్సిన గడువుకు మరో 15 రోజులపాటు అవకాశం కల్పించినట్లు వెల్లడించింది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, వర్షాభావం వల్ల పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రూ.1 ప్రీమియంతో అన్నదాతలకు పంటల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీ సర్కార్ వివరించింది. ఇప్పటికి కూడా నమోదు చేసుకోని రైతులు వెంటనే బీమా నమోదు చేసుకోవాలని సూచించింది. సాగు చేసిన ప్రతి ఎకరానికి బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బ్యాంకులు, సీఎస్సీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, ఔఅఎఖ మొబైల్ యాప్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చని ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

**- వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే**
**-రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి**



హైదరాబాద్,ఆగస్ట్3 సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ
మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

## విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

న్యూఢిల్లీ,ఆగస్ట్3 జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది.

# నంగునూరు, చిన్నకోడూరుకు మినీ స్టేడియంలు మంజూరు చేయాలి

**రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరిన ఏఎంసీ చైర్మన్లు దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్**

సిద్దిపేట, ఆగస్టు 3
సిద్దిపేట జిల్లా నంగునూరు, చిన్నకోడూరు మండలాల్లో యువతలో క్రీడల పట్ల అపారమైన ఆసక్తి, ప్రతిభ ఉన్నప్పటికీ సరైన క్రీడా మౌలిక వసతులు లేక వారు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించలేకపోతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్లు దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నంగునూరు, చిన్నకోడూరు మండల కేంద్రాల్లో ఆధునిక సౌకర్యాలతో కూడిన మినీ స్టేడియంలను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్, ఖోఖో తదితర క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించే సామర్థ్యం ఉన్న క్రీడాకారులు ఎంతోమంది ఉన్నప్పటికీ, సరైన శిక్షణా మైదానాలు, క్రీడా వసతులు లేక వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం యువ క్రీడాకారులు ప్రభుత్వ పాఠశాలల మైదానాలు, ఖాళీ స్థలాలు లేదా వ్యవసాయ భూముల అంచుల్లోనే సాధన చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాలంలో సాధన పూర్తిగా నిలిచిపోతుండగా, వేసవిలో తాగునీరు, విశ్రాంతి వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల కారణంగా ప్రతిభావంతులైన పలువురు యువకులు క్రీడలకు దూరమవుతున్నారని తెలిపారు.
నంగునూరు, చిన్నకోడూరులో మినీ స్టేడియంలు ఏర్పాటు చేస్తే మండల స్థాయి క్రీడా పోటీలు, శిక్షణా శిబిరాలు, పాఠశాలల మధ్య క్రీడా పోటీలు, యువజన కార్యక్రమాలు నిర్వహిం చేందుకు అనువైన వేదిక ఏర్పడుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఈ స్టేడియంలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడా రు. ప్రస్తుత కాలంలో యువత మొబైల్ ఫోన్లు, డిజిటల్ వినోదాల వైపు ఎక్కువగా ఆకర్షితమవుతున్న నేపథ్యంలో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా వారిని ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాల వైపు మళ్లించవచ్చని యాదగిరి పేర్కొన్నారు. క్రీడలు కేవలం పతకాలు సాధించడానికే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కూడా బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు.



వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి సమస్యను సానుకూలంగా పరిశీలించి, రెండు మండలాలకు సంబంధిం చిన అవసరమైన వివరాలను వెంటనే సేకరించాలని తన వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్)ను ఆదేశించినట్లు తెలిపారు. నంగునూరు, చిన్నకోడూరులో మినీ స్టేడియంల ఏర్పాటు ప్రతిపాదనను ప్రాధాన్యతతో పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.
మినీ స్టేడియంలు మంజూరైతే నంగునూరు, చిన్నకోడూరు మండలాలతో పాటు పరిసర ప్రాంతాల క్రీడాకారులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, యువజన సంఘాలు, మహిళా క్రీడాకారులు, గ్రామీణ యువతకు నాణ్యమైన క్రీడా సదుపాయాలు ఒకే వేదికపై అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్లు దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్ మాట్లాడుతూ, నంగునూరు, చిన్నకోడూరుకు మినీ స్టేడియంల ఏర్పాటు అనేది కేవలం నిర్మాణ ప్రాజెక్టు మాత్రమే కాదు. గ్రామీణ ప్రతిభకు గుర్తింపు, యువత భవిష్యత్తుకు బలమైన పెట్టుబడి, క్రీడా సంస్కృతికి నూతన దిశను చూపే నిర్ణయంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

# శిశువులకు తొలి రక్షణ తల్లిపాలే

**- ప్రతి తల్లి ఆరోగ్యం-- ప్రతి శిశువు భవిష్యత్తుకు బలమైన పునాది**
**-ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి**

హనుమకొండఆగస్టు 3:
శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ప్రతి తల్లి తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, శిశువులకు సమయానుకూలంగా తల్లిపాలు అందించాలని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండ గోపాల్‌పూర్‌లోని ఎంపీపీఎస్ ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాశన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు తన చేతుల మీదుగా అన్నప్రాశనం చేయించి ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,
శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించే అమూల్యమైన ఆహారమని పేర్కొన్నారు. శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని, ఆ తరువాత ఏడో నెల నుంచి




వైద్యుల సూచనల మేరకు అనుబంధ పోషకాహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. పిల్లల తల్లులు తమ ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన తల్లే ఆరోగ్యవంతమైన బిడ్డకు పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌పూర్ ఆరోగ్య కేంద్రం--1 పరిధిలోని చిన్నారులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అంగన్‌వాడీ సూపర్వైజర్లు జ్యోతి, ఝాన్సీ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రీతి, జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సమత, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# మలేరియా, డెంగ్యూ నియంత్రణకు ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టాలి

**● ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి**
**● మండల ప్రత్యేక అధికారులకు జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆదేశాలు**

సిద్దిపేట, ఆగస్టు 3
మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే ఐదు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, వాటి సంఖ్య మరింత పెరగకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, గ్రామాలు మరియు పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి




ఇళ్ల పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిల్వ నీరు దోమల వ్యాప్తికి ప్రధాన కారణమవుతుందని, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.
పంచాయతీ రాజ్ శాఖ సమన్వయంతో ఈ నెల 4వ తేదీ మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల ఆవరణలో నిల్వ నీరు లేకుండా చూడడంతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించి పరిశు[illegible] వాతావరణాన్ని కల్పించాలని సూ[illegible]
జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల్లో వెంటనే డోర్ టు డోర్ ఫీవర్ సర్వే చేపట్టి, అనుమానిత జ్వర బాధితులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, అదే సమయంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు

**సమర్థంగా 1అమలుకు కలసి పనిచేయాల్సిందే**
**అధికారులతో సమీక్షలో సిఎస్ స్పష్టీకరణ**

హైదరాబాద్,ఆగస్ట్3 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయము అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, మహేష్ దత్ ఎక్క, సవ్య సాచి ఘోష్, వాణి ప్రసాద్, దాన కిషోర్, నవీన్ మిట్టల్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, క్రిస్టినా చొంగ్తూ, రఘునందన్ రావ్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, హరిచందన, బాల మాయాదేవి, సురేంద్ర మోహన్, ఇలంబర్తి తదితరులు హాజరయ్యారు. సందర్బంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దార్శనికతతో రాష్ట్రంలో పురోగతిలో ఉన్నఅనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్ధవంతంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయము అవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్ బోర్డు ను ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఈ పథకాలు, కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలవడానికి స్పీడ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మరో వారం రోజుల్లో ప్రభుత్వ ఎ÷-లాగ్ షిప్ పథకాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరు, లక్ష్యాలు, పురోగతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్రప్రాయోజిత పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యదర్శులతో త్వరలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, ఇందుకు సన్నద్ధం కావాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతీ శాఖలో అమలవుతున్న వినూత్న పథకాలు/ విజయ గాధాలపై నివేదిక రూపొందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలతో సహా అన్నింటికీ టి-్గ÷బైర్ కనెక్టివిటీ ని తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విజన్ డాక్యుమెంట్-2047 లో సూచించిన నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికా బద్దంగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, నివేదికలు, ప్రతిపాదనలను సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, తద్వారా కేంద్ర నిధులు విడుదల కావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. నవంబర్ 14వ తేదీ నుండి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఖేలో-ఇండియా క్రీడోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దాదాపు 7 వేలకు పైగా క్రీడా కారులు, అధికారులు, కోచ్ లు హాజరయ్యే ఈ ఖేలో ఇండియా స్పోర్ట్స్ కు 26 క్రీడా రంగాల్లో పోటీలను 11 వేదికలలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. కొర్ పరిధిలో వాహన కాలుష్యాన్ని తగ్గించాలన్న ముఖ్యమంత్రిగారి ఆదేశాలమేరకు డీజిల్ తో నడిచే ఆటోలకు ఎలక్ట్రిక్ ఇంజన్లు అమర్చే పథకాన్ని వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో వరి పంటకు సరిపడా నీరు లభ్యం కాదని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని సిఎస్ సూచించారు.

## నిజామాబాద్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ మెషిన్ అవసరం

హైదరాబాద్,ఆగస్ట్3 హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధ్యక్షతన నిర్వహించిన నిజామాబాద్ జిల్లా ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా ఆరోగ్య సంబంధిత సమస్యలు, ప్రభుత్వ వైద్య సంస్థల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, మందుల లభ్యత, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, ప్రజారోగ్య సేవల మెరుగుదల తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్బంగా బాల్కొండ నియోజకవర్గం ఆరోగ్య శాఖ కు సంబంధించి పలు ప్రతిపాదనలు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహకి అందించి మంజూరు చేయవలసిందిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. నిజామాబాద్ జిల్లా ?ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఎంఆర్ఐ మెషిన్ ను మంజూరు చేయాలనీ, ఖాళీ పోస్టు లను భర్తీ చేయాలనీ,అత్యవసర అవసరాల కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

## సిదిరి పోలీస్ క స్టడీకి కోర్టు అనుమతి

శ్రీకాకుళం,ఆగస్ట్3 వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఒక రోజు పోలీస్ కస్టడీకి పలాస జూనియర్ సివిల్ జడ్జి అనుమతిచ్చారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గతనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ, సిద్దార్థ త్యాడీలను పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో ఏ3గా ఉన్న అప్పలరాజును అరెస్టు చేయగా ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా అంపోలులోని జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో పలాస పోలీసులు అప్పలరాజు కస్టడీకి పిటిషన్ వేయగా ఒక రోజు అనుమతిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు విచారించే అవకాశముంది.

# ముగిసిన కామన్వెల్త్ గేమ్స్ 2026



- 11 రోజుల పాటు సాగిన క్రీడా సంబరం
- స్కాట్లాండ్ లోని గ్లాస్గో వేదికగా పోటీలు
- కేవలం 10 క్రీడా విభాగాల్లో నిర్వహణ
- 74 దేశాలకు నుండి పాల్గొన్న క్రీడాకారులు
- ఈసారి సత్తా చాటిన భారత క్రీడాకారులు
- 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు
- పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానం
- 2030లో కామన్వెల్త్ కు భారత్ ఆతిథ్యం
- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహణ



స్కాట్లాండ్ లోని గ్లాస్గో నగరంలో 11 రోజుల పాటు హోరాహోరీగా సాగిన కామన్వెల్త్ గేమ్స్ 2026 క్రీడలు ముగిశాయి. జూలై 23న ప్రారంభమైన ఈ ప్రతిష్టాత్మక పోటీలు ఆదివారం (ఆగస్టు 3) తెల్లవారుజామున ముగింపు వేడుకలతో ముగిశాయి. ఈసారి గ్లాస్గో నిర్వాహకులు బడ్జెట్ కారణాల వల్ల ఈవెంట్ల సంఖ్యను కుదించి, కేవలం 10 క్రీడా విభాగాల్లో మాత్రమే పోటీలను నిర్వహించారు. అయినప్పటికీ, 74 దేశాలకు చెందిన వేలాది మంది అథ్లెట్లు పాల్గొన్న ఈ క్రీడా వేడుకల్లో భారత అథ్లెట్లు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ప్రతిష్టాత్మక కామన్‌వెల్త్ గేమ్స్ 2026 పాయింట్స్ టేబుల్‌లో టాప్-5లో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్.. అనుకున్నది సాధించింది. భారత్ తరఫున రేసులో నిలిచిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో మొత్తం 39 పతకాలను కొల్లగొట్టారు. ఇందులో 13 పసిడి పతకాలు, 17 వెండి పతకాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ ఓవరాల్ పతకాల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడాల తర్వాతి స్థానంలో నిలిచి నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. గతంలో జరిగిన 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌తో పోలిస్తే ఈసారి పతకాల సంఖ్య తగ్గింది. 2022లో భారత్ 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్యాలతో మొత్తం 61 పతకాలు సాధించి పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే గ్లాస్గో 2026 గేమ్స్‌లో భారత్‌కు పతకాలు తెచ్చిపెట్టే సాంప్రదాయ క్రీడలైన షూటింగ్, రెజ్లింగ్ (కుస్తీ), బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీలను తొలగించడం పతకాల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమైంది. అడ్డంకులు ఎదురైనా, లభించిన పరిమిత అవకాశాల్లోనే భారత క్రీడాకారులు చూపిన పట్టుదల ప్రశంసనీయం. ముఖ్యంగా మహిళా అథ్లెట్లు ఎక్కువ సంఖ్యలో స్వర్ణాలు సాధించి సత్తాచాటారు. కామన్వెల్త్ క్రీడలు ముగియడంతో భారత అథ్లెట్లు తమ తర్వాతి లక్ష్యమైన ఏషియన్ గేమ్స్‌పై ఫోకస్ పెట్టారు.

ఇక 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2010లో దిల్లీలో కామన్వెల్త్ గేమ్స్‌కు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిన భారత్, రెండోసారి ఈ బహుళ క్రీడల మహోత్సవాన్ని నిర్వహించనున్న దేశంగా నిలిచింది. ఆస్ట్రేలియా తర్వాత కామన్వెల్త్ గేమ్స్‌కు రెండుసార్లు ఆతిథ్యం ఇస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. అధికారిక బాధ్యతల బదిలీ కార్యక్రమంలో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవీ భారత తరఫున కామన్వెల్త్ జెండా, బ్యాటన్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమం ముగింపు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లాస్గోలో బాధ్యతల బదిలీ కార్యక్రమం పూర్తికావడంతో ఇప్పుడు ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి 2030 కామన్వెల్త్ గేమ్స్‌పై పడింది. శతాబ్ది సంచికకు ఆతిథ్యం ఇవ్వనున్న అహ్మదాబాద్ ప్రపంచ స్థాయి క్రీడా వేదికగా నిలిచేందుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించే అవకాశం ఉంది. 2010 దిల్లీ గేమ్స్ తర్వాత మరోసారి భారత్ కామన్వెల్త్ క్రీడలను నిర్వహించనున్న నేపథ్యంలో దేశ క్రీడా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లైంది.

# గ్లాస్గో రెస్టారెంట్? క్షమాపణలు..






కశ్మీర్?, ఈశాన్య రాష్ట్రాలు లేకుండా నాప్?కిన్?పై భారత మ్యాప్?ను ముద్రించిన గ్లాస్గో రెస్టారెంట్? సోమవారం క్షమాపణలు చెప్పింది. అంతేకాదు తమ లోగోను మారుస్తామని ప్రకటించింది. క్షమాపణలు చెప్పిన వెంటనే, సదరు రెస్టారెంట్? తన ఇన్?స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేసింది. భారత బాక్సర్? లవ్లీనా బోర్గోహైన్? ఆ రెస్టారెంట్? లోగోపై భారతదేశ మ్యాప్ తప్పుగా ఉందని, కశ్మీర్?తోపాటు ఈశాన్య రాష్ట్రాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో సదరు రెస్టారెంట్ ఈ దిద్దుబాటు చర్యలు తీసుకుంది. కామన్వెల్త్ గేమ్స్?లో 10 పతకాలు (7 స్వర్ణాలు, 3 రజతాలు) సాధించిన భారత బాక్సింగ్ బృందం 'మిస్టరర్ సింగ్స్? ఇండియా, ది హోమ్ ఆఫ్ కర్రీ' అనే రెస్టారెంట్?కు వెళ్లింది. అయితే ఆ రెస్టారెంట్?లోని నాప్?కిన్?పై ముద్రించిన భారత మ్యాప్?లో ఈశాన్య రాష్ట్రాలు లేవని బాక్స్? లవ్లీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరో విషయం ఏమిటంటే, ఆ నాప్?కిన్?పై ముద్రించిన ఇండియా మ్యాప్?లో కశ్మీర్ కూడా లేదు. ?దీనిపై భారత బాక్సింగ్ ఫెడరేషన్ మండిపడింది. తర్వాత ఈ మ్యాప్ వివాదంపై స్కాట్లాండ్?లోని భారత ఎంబసీ కూడా స్పందించింది. ఒలింపిక్ పతక విజేత లవ్లీనా బోర్గోహెయిన్ మహిళల 75 కేజీల విభాగంలో రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్న విషయం తెలిసిందే. ఆమె అసంపూర్తి భారత మ్యాప్?పై వ్యక్తం చేసిన అభ్యంతరానికి భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అధ్యక్షుడు అజయ్ సింగ్ మద్దతు ప్రకటించారు. ఆ నాప్కిన్స్‌పై ముద్రించిన మ్యాప్‌లో కేవలం ఈశాన్య రాష్ట్రాలే కాకుండా, కశ్మీర్ కూడా లేదని మండిప డ్డారు. భారతదేశ పటాన్ని తప్పుల తడకగా ముద్రించడం, ప్రదర్శించడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సదరు రెస్టారెండ్? యాజమాన్యం ఆ తప్పును సరిదిద్దుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భారత నిజమైన సరిహద్దులు స్పష్టంగా తెలిసేలా ఇండియా మ్యాప్?ను వెంటనే సరిచేయాలని ఆయన కోరారు. సోషల్ మీడియాలోనూ సదరు రెస్టారెంట్?పై విమర్శల వర్షం కురిసింది. దీనితో సదరు రెస్టారెంట్? తాజాగా క్షమాపణలు చెప్పడంతోపాటు తమ ఇన్?స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేసింది. లోగోను కూడా మారుస్తామని ప్రకటించింది. "మా భారతీయ వారసత్వం, మూలాల పట్ల 'మిస్టర్ సింగ్స్ ఇండియా ' ఎంతో గర్వపడుతుంది. దాదాపు 32 ఏళ్లుగా మేము భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారికి సేవలు అందిస్తున్నాం. మేము భారతదేశపు తప్పుడు మ్యాప్?ను ప్రదర్శించినందుకు బేషరతుగా క్షమాపణలు కోరుతున్నాము. దీనిని సరిదిద్దడానికి మేము తక్షణ చర్యలు తీసుకంటాం. మరోసారి మా హృదయపూర్వక క్షమాపణలు. మేము ఎవరినీ బాధపెట్టాలని అనుకోలేదు. పైగా భారతీయ బృందానికి గర్వంగా సేవ చేయాలని అనుకుంటున్నాము" అని సదరు రెస్టారెంట్ పేర్కొంది. "

# డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు రిలీఫ్



రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియామాజీ చీఫ్, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆరుగురు మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు నమోదైన లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌తో పాటు.. డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన వినోద్ తోమర్‌లను ఢిల్లీ న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టులో అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అశ్వినీ పన్వార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో వాదనలు విన్న న్యాయస్థానం గురువారం తన తుది తీర్పును రిజర్వ్ చేసింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై 2023 జూన్ 15న ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. ఐపీసీ 354, 354ఏ, 354డీ, 506 సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది. 2024 మే నెలలో బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కింద అభియోగాలు నమోదు చేయాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అయితే ఆరుగురు ఫిర్యాదుదారుల్లో ఒకరు చేసిన ఆరోపణల నుంచి ఆయనకు విముక్తి కల్పించింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ సమయంలో బ్రిజ్ భూషణ్, తోమర్ ఇద్దరూ బెయిల్ మీద బయట ఉన్నారు. మూడేళ్ల క్రితం భారత ప్రముఖ రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ.. నిరసనలు చేపట్టడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో రెజ్లర్లు చేపట్టిన ఆందోళన అప్పట్లో దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. రెజ్లర్లపై వేధింపులకు పాల్పడేందుకు తన లభించిన ప్రతి అవకాశాన్ని బ్రిజ్ భూషణ్ ఉపయోగించుకున్నాడని ఢిల్లీ పోలీసులు 2023 సెప్టెంబర్లో కోర్టుకు తెలిపారు. తాజాగా కోర్టు తీర్పు అనంతరం బ్రిజ్ భూషణ్ మీడియాతో మాట్లాడారు. తాను ఏ తప్పు చేయలేదని, తనపై కుట్ర పన్నారని తాను మొదటి నుంచి చెబుతున్నానని.. తాను తప్పు చేశానని తేలితే తనకు తానుగా ఉరి వేసుకుంటానని మొదటి రోజు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కోర్టు తనను నిర్దోషిగా తేల్చిందని.. ఇది తనకు, తన అనుచరులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ రోజు తనకు ఎంతో సంతోషకరమైన రోజని ఆయన తెలిపారు. హక్కుల ఉల్లంఘనకు గురి అవుతోన్న జూనియర్ అథ్లెట్ల కోసం తాము పోరాడామని బ్రిజేష్ చెప్పుకొచ్చారు.

# టీమిండియా సరికొత్త టెస్ట్ మిషన్

- ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటన
- ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసుపై దృష్టి



జింబాబ్వే పర్యటన తర్వాత భారత జట్టుకు కొన్ని రోజుల పాటు విరామం దొరికింది. ఈ బ్రేక్ అనంతరం భారత క్రికెట్ జట్టు మళ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌పై దృష్టి సారించింది. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటనతో టీమిండియా సరికొత్త టెస్ట్ మిషన్‌ను ప్రారంభించనుంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నాయకత్వంలోని భారత జట్టుకు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉన్న భారత్ ఖాతాలో ఇంకా తొమ్మిది టెస్టులు మిగిలి ఉన్నాయి. ఇందులో శ్రీలంకతో 2 టెస్టులు, న్యూజిలాండ్ పర్యటనలో 2 టెస్టులు, ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే 5 టెస్టుల సిరీస్ ఉన్నాయి. ఈ తొమ్మిది మ్యాచ్‌లలో కనీసం 7 నుంచి 8 మ్యాచ్‌లు గెలిస్తేనే టాప్-2లో నిలిచి ఫైనల్ అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రేసులో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు ముందంజలో ఉన్నాయి. కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గంభీర్ నేతృత్వంలోని టీమిండియా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా సిరీస్‌లలో ఓటములను చవిచూసింది. దీంతో ఆయన కోచింగ్ సామర్థ్యంపై పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అంశంపై భారత మాజీ వికెట్ కీపర్, వ్యాఖ్యాత దీప్ దాస్‌గుప్తా స్పందిస్తూ.. గంభీర్‌కు ఇది నిప్పులాంటి పరీక్ష అని వ్యాఖ్యానించారు. "జట్టు ఆశించిన స్థాయిలో రాణించనప్పుడు హెడ్ కోచ్, కెప్టెన్, మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నించడం సహజం. 2011-12 తర్వాత మనం స్వదేశంలో సిరీస్ కోల్పోవడమే కాకుండా, న్యూజిలాండ్‌తో వరుస ఓటములను చూశాం. గత మూడు సిరీస్‌లలో రెండింటిని కోల్పోయాం కాబట్టి ఒత్తిడి ఉండటం ఖాయం. అయితే గంభీర్, శుబ్‌మన్ గిల్‌లతో పాటు భారత ఆటగాళ్లకు ఒత్తిడిని ఎలా జయించాలో బాగా తెలుసు" అని ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దాస్‌గుప్తా పేర్కొన్నారు. జట్టులో జరుగుతున్న మార్పులపై దాస్‌గుప్తా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. "న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్ నుంచి జట్టులో మార్పుల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ మార్పులు ఏ దిశగా సాగుతున్నాయనే దానిపై నాకు కాస్త అయోమయం ఉంది. జట్టు ప్రయాణిస్తున్న తీరుపై స్పష్టమైన అవగాహన కనిపించడం లేదు" అని ఆయన అన్నారు. ముందున్న కఠినమైన పర్యటనల గురించి హెచ్చరిస్తూ..టీమిండియాకు ఏ టెస్టు సిరీస్ కూడా తేలికైంది కాదు. ముఖ్యంగా శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలు ఎల్లప్పుడూ సవాల్‌తో కూడుకున్నవే. మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలవడం అంత సులభం కాదు. గత మూడు సిరీస్‌లలో రెండింటిని కోల్పోయిన నేపథ్యంలో ఏ ప్రత్యర్థినీ, ఏ పరిస్థితినీ తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు" అని దాస్‌గుప్తా ముగించారు.

## సంపాదకీయం

# హామీలను మోసగిస్తున్న పాలకులు !

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు.

ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది.

జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు.

దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

- ● సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్
- ● నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు..మద్దతుగా ఆందోళన
- ● ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే

రాంచీ,ఆగస్ట్3 నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకు న్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళన కారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక పక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు

జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షల్లో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది.



దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**- ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా- 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్**




హైదరాబాద్,ఆగస్ట్3: తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల కేసు

**బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట- ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు**

న్యూఢిల్లీ,ఆగస్ట్3 మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది. 2016-2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు.

## ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

రాంచీ,ఆగస్ట్3ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి.




# యస్ చెబితేనే నగదు బదిలీ..

## యూపీఐ కొత్త ఫీచర్‌కు ప్రతిపాదన

డిజిటల్ చెల్లింపుల్లో మోసాలను అరికట్టేందుకు బ్యాంకులు కొత్త ఫీచర్‌ను ప్రతిపాదించాయి. యూపీఐ ట్రాన్సాక్షన్‌కు సంబంధించి 'యస్' ఆప్షన్‌ను ఎంచుకున్నాకే నగదు బదిలీ అయ్యేలా కొత్త ఫీచర్ అమల్లోకి తేవాలన్న ప్రతిపాదనను ఆర్బీఐ ముందుంచినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం బయోమెట్రిక్ ఆథెంటికేషన్, లేదా పిన్ నంబర్ ఎంటర్ చేశాక నగదు బదిలీ జరుగుతోంది. దీనికి అదనంగా యస్ ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తెస్తే భద్రత మరింత పెరుగుతుందని బ్యాంకులు భావిస్తున్నాయి. అయితే, హైరిస్క్ లావాదేవీలకు మాత్రమే ఈ ఫీచర్ వర్తింప చేస్తామని బ్యాంకులు చెబుతున్నాయి. ఈ అంశాన్ని ఆర్బీఐ పరిశీలిస్తోంది.

ఫీచర్ పనితీరు ఇలా..

అనుమానాస్పదంగా ఉన్న నగదు బదిలీని బ్యాంకుల్లోని ఫ్రాడ్ డిటెక్షన్ ఇంజన్‌లు గుర్తిస్తాయి. అనంతరం కస్టమర్ ఫోన్‌లో ఒక పాప్ అప్ విండో ప్రత్యక్షం అవుతుంది. బదిలీకి అనుమతించేందుకు యస్ ఆప్షన్, వద్దనేందుకు నో ఆప్షన్ ఈ విండోలో ఉంటాయి. యస్ ఆప్షన్‌ను ఎంచుకున్నాకే నగదు బదిలీ పూర్తవుతుంది. బ్యాంకు దృష్టిలో హైరిస్క్ లావాదేవీలకు మాత్రమే వర్తించేలా ఈ ఫీచర్‌ను డిజైన్ చేయనున్నారు.

కొత్త మార్గాల్లో సైబర్ నేరాలు..

ఇటీవల కాలంలో యూపీఐ చెల్లింపులకు సంబంధించి మోసాలు పెరుగుతున్న వైనాన్ని బ్యాంకులు గుర్తించాయి. నేరగాళ్లు హ్యాకింగ్‌కు బదులు బాధితుల్ని ప్రభావితం చేసి డబ్బుల్ని దండుకోవడానికి అలవాటు పడ్డారు. ఫోన్ కాల్స్, మెసేజీ యాప్‌ల ద్వారా యూజర్లను సంప్రదించి తక్షణ బదిలీకి ఒత్తిడి చేసి డబ్బును దోచుకుంటున్నారు. చాలా సందర్భాల్లో నగదు అకౌంట్ నుంచి బదిలీ అయ్యాక తిరిగి పొందే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో, బాధితులు మోసం జరిగిందని గుర్తించే సరికి చాలా ఆలస్యం జరుగుతోంది.

# మార్కెట్ల ఆల్‌టైమ్ జోరు..




వారంలో మొదటి ట్రేడింగ్ రోజైన ఈరోజు (సోమవారం) దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పడిపోవడం, విదేశీ ఇన్వెస్టర్లు (ఫీ×ఐ) మళ్లీ కొనుగోలు బాట పట్టడం, సానుకూల గ్లోబల్ సంకేతాలు మార్కెట్లకు బలమైన ఊపునిచ్చాయి. ఇవాళ్టి మార్కెట్లో హైలెట్ ఏంటంటే.. ఆఖరి 5 నిమిషాల్లో చోటుచేసుకున్న బలమైన కొనుగోళ్లతో నిఫ్టీ రోజులోనే గరిష్ఠ స్థాయి వద్ద ముగియడం విశేషం. ఆఖరి నిమిషంలో స్పైక్: ఈరోజు నుంచి అమల్లోకి వచ్చిన కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (జాగా) ఎక్స్‌టెండెడ్ ట్రేడింగ్ ప్రొసీజర్స్‌తో ముగింపు సమయంలో నిఫ్టీ ఏకంగా 24,774 గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. జులై నెలలో రూ.20,200 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు, శుక్రవారం నాటి ట్రేడింగ్‌లోనూ నికర కొనుగోలుదారులుగా నిలవడంతో ఇన్వెస్టర్ల నమ్మకం పెరిగింది. ఆటో, ఏవియేషన్, బ్యాంకింగ్ షేర్ల జోరు: ఇంధన ధరల తగ్గుదలతో ఏవియేషన్ (ఇండిగో), ఆటో, ఫైనాన్షియల్ సెక్టార్ షేర్లలో భారీగా కొనుగోళ్లు నమోదయ్యాయి. ప్రధానంగా ఎఫ్ఎంసీజీ (ఫీవీజ+), ఐటీ (×ఐ) టల్ రంగాలు మార్కెట్లను ముందుండి నడిపించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 544.39 పాయింట్లు (0.70శాతం లాభపడి 78,639.03 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 ఏకంగా 390.70 పాయింట్లు (1.6%) ఎగబాకి 24,774.30 వద్ద కీలక స్థాయిని దాటి ముగిసింది.ఎఫ్ఎంసీజీ, ఐటీ, మెటల్ రంగాలు మార్కెట్ లాభాల్లో సింహభాగం వహించాయి. మరోవైపు, నిఫ్టీ మీడియా, నిఫ్టీ హెల్త్‌కేర్ రంగాలు తీవ్ర ఒత్తిడికి లోనై నష్టాల్లో ముగిశాయి.

# కిడ్నీ స్టోన్లు అసలు ఎందుకు ఏర్పడుతాయి..



మూత్రపిండాల్లో రాళ్లు (కిడ్నీ స్టోన్స్) ఏర్పడటం ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ ఆరోగ్య సమస్య. ఇవి బయటకు వచ్చే సమయంలో తీవ్రమైన నొప్పిని కలిగించినప్పటికీ, సరైన సమయంలో గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే శాశ్వత నష్టం కలిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వైద్య చికిత్స అవసరమైనప్పటికీ, చిన్న పరిమాణంలో ఉన్న రాళ్లు బయటకు వెళ్లేందుకు కొన్ని ఇంటి చిట్కాలు కూడా ఉపయుక్తంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. మూత్రపిండాల్లో ఖనిజాలు, లవణాలు పేరుకుపోవడం వల్ల గట్టి స్ఫటికాల రూపంలో రాళ్లు ఏర్పడతాయి. మూత్రంలో స్ఫటికాలు ఒకదానితో ఒకటి అతుక్కుపోకుండా నిరోధించే పదార్థాలు తగ్గిపోతే రాళ్లు ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఇవి బఠాణీ గింజంత చిన్నవిగా ఉంటాయి లేదా గోల్ఫ్ బంతి పరిమాణం వరకు పెరుగుతాయి. ఎక్కువగా కాల్షియం ఆక్సలేట్‌తో ఏర్పడే ఈ రాళ్లు మూత్రవిసర్జనలో ఇబ్బంది, తీవ్రమైన పొత్తికడుపు లేదా నడుము నొప్పి, మూత్రంలో రక్తం, వికారం, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలను కలిగిస్తాయి.

యాపిల్ సైడర్ వెనిగర్, నిమ్మరసం..

మూత్రపిండాల్లో రాళ్లు అనేక రకాలుగా ఉంటాయి. మూత్రనాళ ఇన్ఫెక్షన్ల కారణంగా స్ట్రువైట్ రాళ్లు ఏర్పడతాయి. తగినంత నీరు తాగకపోవడం లేదా శరీరంలో ద్రవాలు అధికంగా కోల్పోవడం వల్ల యూరిక్ యాసిడ్ రాళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. అత్యంత సాధారణంగా కనిపించేవి కాల్షియం రాళ్లు. వీటిలో ఎక్కువ భాగం కాల్షియం ఆక్సలేట్ రూపంలో ఉంటాయి. ఆక్సలేట్ అంటే కొన్ని ఆహారాల్లో సహజంగా ఉండే పదార్థం. ఇది కాలేయంలో కూడా ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా పెద్ద రాళ్లకు శస్త్రచికిత్స అవసరం అవుతుంది. అయితే చిన్న రాళ్లు బయటకు వెళ్లేందుకు కొన్ని సహజ మార్గాలు ఉపయుక్తంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్‌తోపాటు నిమ్మరసాన్ని కలిపి తీసుకోవడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ రెండింటిలోనూ ఉండే సిట్రిక్ యాసిడ్ కిడ్నీ రాళ్లను క్రమంగా కరిగించడంలో, మూత్రాన్ని క్షార స్వభావంలోకి మార్చడంలో సహాయపడుతుంది. రెండు టేబుల్ స్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్‌ను 6 నుంచి 8 ఔన్సుల శుద్ధి చేసిన నీటిలో కలిపి రోజంతా తాగవచ్చు. అయితే రోజుకు ఒక గ్లాసుకు మించి తీసుకోకూడదు. అధిక మోతాదులో తీసుకుంటే పొటాషియం స్థాయిలు తగ్గడం, ఎముకల బలహీనత వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

నీళ్లను అధికంగా తాగాలి..

కిడ్నీ రాళ్లు బయటకు వెళ్లే సమయంలో ఎక్కువగా నీరు తాగడం చాలా ముఖ్యం. తగినంత నీరు తాగకపోవడం కూడా రాళ్లు ఏర్పడటానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెప్పవచ్చు. రాళ్లు ఉన్న సమయంలో రోజుకు కనీసం 12 గ్లాసుల నీరు తాగడం వల్ల అవి త్వరగా బయటకు వెళ్లేందుకు సహాయపడతాయని చెబుతున్నారు. ఆ తర్వాత కూడా శరీరంలో నీటి కొరత రాకుండా చూసుకోవడం అవసరం. సెలరీ కూడా కిడ్నీ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఇది శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు పంపించడంలో సహాయపడుతుంది. ఒకటి లేదా రెండు సెలరీ కాడలను నీటిలో మరిగించి వచ్చిన ద్రావణాన్ని రోజంతా తాగవచ్చు. అయితే లోబీపీ ఉన్నవారు లేదా త్వరలో శస్త్రచికిత్స చేయించుకోబోతున్నవారు దీనిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. సెలరీ రసం, సెలరీ గింజలను మసాలాగా లేదా టీలో కూడా ఉపయోగించవచ్చు. రాజ్మా గింజలు మెగ్నీషియానికి మంచి మూలం. ఇవి కిడ్నీ రాళ్ల వల్ల కలిగే కొన్ని లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. రాజ్మా కాయలలోని గింజలను తీసిన తర్వాత మిగిలిన తొక్కలను శుద్ధి చేసిన నీటిలో సుమారు ఆరు గంటల పాటు మరిగించి, వచ్చిన ద్రావణాన్ని వడగట్టి చల్లార్చి ఒక రోజు మొత్తం తాగవచ్చు

# జీడిపప్పును తింటే శరీరంలో కొవ్వు పెరుగుతుందా..



జీడిపప్పు గురించి మాట్లాడేటప్పుడు చాలామంది అందులో ఫైబర్ తక్కువగా ఉంటుందని, దానిని తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుందని భావిస్తుంటారు. కానీ వాస్తవానికి జీడిపప్పు అనేక పోషక విలువలతో నిండి ఉంటుంది. వెన్నలాంటి మృదువైన రుచి కలిగిన ఈ గింజలు బ్రెజిల్‌లో పుట్టి, తర్వాత భారతీయ వంటకాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. నెయ్యిలో వేయించి, ఉప్పు కలిపి తిన్నా, పచ్చిగా తీసుకున్నా జీడిపప్పు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే మితంగా తీసుకోవడం తప్పనిసరి. జీడిపప్పుతోపాటు జీడిపండు కూడా అనేక పోషకాలను అందిస్తుంది. ఒక ఔన్స్ (సుమారు 28 గ్రాములు) పచ్చి జీడిపప్పులో సుమారు 155 కేలరీలు, 9.2 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 5.1 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. అలాగే విటమిన్ ఇ, విటమిన్ బి6 స్వల్ప మోతాదులో లభిస్తాయి. విటమిన్ కె, కాల్షియంతో పాటు జింక్, మెగ్నీషియం, కాపర్, ఫాస్ఫరస్, ఫోలిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా సమృద్ధిగా ఉంటాయి.

విటమిన్ల శోషణకు..

జీడిపప్పులో ఉండే ఆరోగ్యకరమైన మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు శరీరానికి అవసరమైన విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి కొవ్వులో కరిగే విటమిన్ల శోషణకు సహాయపడతాయి. పరిమిత మోతాదులో తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఉపయోగకరంగా ఉంటాయి. జీడిపప్పును క్రమం తప్పకుండా మితంగా తీసుకోవడం వల్ల రక్తహీనత ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. శరీరంలో కాపర్ లోపం ఏర్పడితే ఐరన్ వినియోగం సరిగా జరగక రక్తహీనత వచ్చే అవకాశం ఉంటుంది. జీడిపప్పులో కాపర్ సమృద్ధిగా ఉండటం వల్ల ఈ లోపాన్ని నివారించడంలో దోహదపడుతుంది. క్యారెట్ కళ్లకు మేలు చేస్తుందని అందరికీ తెలిసిందే. అయితే జీడిపప్పు కూడా కంటి ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో ఉండే జియాజాంథిన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ రెటీనాపై రక్షణ పొర ఏర్పరచి, సూర్యకిరణాలు, కాలుష్యం వల్ల కలిగే నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

అనేక మినరల్స్ కూడా..

జీడిపప్పు నుంచి తీసే నూనె చర్మ సంరక్షణలో కూడా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే జింక్, మెగ్నీషియం, ఫాస్పరస్, ఇనుము వంటి ఖనిజాలు చర్మానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది తోడ్పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జీడిపప్పులో కేలరీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, సరైన మోతాదులో తీసుకుంటే బరువు నియంత్రణకు కూడా ఉపయోగపడుతుంది. జంతు కొవ్వులు, ప్రోటీన్లకు బదులుగా జీడిపప్పు వంటి వృక్షాధార ఆహారాలను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్, శరీరంలో కొవ్వు పేరుకుపోవడం తగ్గే అవకాశం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇందులో ఉండే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు. అయితే జీడిపప్పును పచ్చిగా, ఉప్పు కలపకుండా తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని సూచిస్తున్నారు. జీడిపప్పును తినడం లేదా జీడినూనెను ఉపయోగించడం వల్ల జుట్టు ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. ఇందులో ఉండే కాపర్ మెలనిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది.

# ఒత్తిడి, నిద్రలేమి సమస్యలను తగ్గించే హెర్బల్ టీలు.. రోజూ తీసుకుంటే ఎంతో మేలు..



ఒత్తిడి, ఆందోళన నేటి జీవనశైలిలో సర్వసాధారణ సమస్యలుగా మారాయి. ఇలాంటి సమయంలో చాలామంది మందులపై ఆధారపడుతుంటారు. అయితే కొన్ని సహజ మూలికలతో తయారుచేసిన హెర్బల్ టీలు మనసుకు ప్రశాంతతను అందించడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఒక కప్పు వేడి హెర్బల్ టీ శరీరంతోపాటు మనసుకు కూడా సేదతీరే అనుభూతిని కలిగిస్తుంది. గ్రీన్ టీ ఒత్తిడిని తగ్గించేందుకు ఎక్కువగా ఉపయోగించే హెర్బల్ పానీయాల్లో ఒకటి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం, శరీరంలోని మలినాలను తొలగించడంలో సహాయపడటమే కాకుండా, ఇందులో ఉండే పాలీఫినాల్స్ ఆందోళనను తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. రోజ్ టీ కూడా నరాలను ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడే పానీయంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా రాత్రి నిద్రకు ముందు దీనిని తీసుకుంటే మంచి నిద్రకు దోహదపడుతుందని చెబుతున్నారు. ఎండబెట్టిన గులాబీ రేకలను నీటిలో మరిగించి, అవి ముదురు రంగులోకి మారిన తర్వాత వడగట్టి తాగవచ్చు. ప్యాషన్ ఫ్లవర్ టీ..ప్యాషన్ ఫ్లవర్ టీ కూడా ఒత్తిడి తగ్గించేందుకు సహజమైన మార్గంగా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఫ్లేవోన్ క్రైసిన్ అనే పదార్థం ఆందోళనను తగ్గించడంలో, ప్రశాంతమైన నిద్రకు తోడ్పడటంలో సహాయపడుతుంది. ఎండబెట్టిన ప్యాషన్ ఫ్లవర్‌ను నీటిలో మరిగించి వడగట్టి ఈ టీని తయారు చేసుకోవచ్చు. క్యామొమైల్ టీ ప్రయోజనకరంగా ఉంటుంది.




# వారణాసి కథలో భారీ బలముందు

### దర్శకధీరుడు జక్కన్న వెల్లడి

స్టార్ హీరో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'లో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. టైమ్ ట్రావెల్ కథాంశం, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను జక్కన్న పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్నేషనల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' ప్రస్తుత పరిస్థితితో పాటు, ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటికే 'వారణాసి' 80 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంకా 20శాతం ఉంది. ఈ సినిమాకు సంబంధించి కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ పూర్తి చేశాం. మిగిలినవి చిన్న చిన్న సన్నివేశాలే. 2022 నుంచి 'వారణాసి' కథను డెవలప్ చేయడం మొదలు పెట్టాం. అంటే దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని వివరించారు. వారణాసి' గురించి అన్నీ ఇప్పుడే చెప్పలేం. 'ఇండియానా జోన్స్' అంటే నాకు చాలా ఇష్టం. ఆ కథ, హీరో చేసే సాహసాలు చిన్న పిల్లలకు నచ్చుతాయి. నాకూ సరదాగా అనిపిస్తాయి. కథ, దాని నేపథ్యం తెలియకుండా ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించలేరని నా అభిప్రాయం. అందుకే 'వారణాసి'కి సంబంధించి వీడియో ప్రత్యేకంగా ఉండేలా గ్లింప్స్‌ను విడుదల చేశాం. ఆఫ్రికాల్లో ప్రయాణించి రామాయణ కాలానికి తీసుకెళ్తుంది.




# దంపతుల మధ్య అనురాగం నిత్యనూతనం విశ్వనాధ్ అండ్ సన్స్

హీరో సూర్య ప్రముఖ నటుడు సూర్య, మమితా బైజు ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆడియో విడుదల వేడుకలో హీరో సూర్య ప్రేమ, పెళ్లి, దంపతుల మధ్య పరస్పర గౌరవం గురించి మాట్లాడారు. ప్రేమ అనేది పెళ్లితో ముగిసిపోయేది కాదు. బంధంలో అనురాగం ప్రతిరోజూ వ్యక్తమవ్వాలి. భాగస్వామిని జీవితాంతం ప్రతి రోజూ ప్రేమిస్తూనే ఉండాలి. ఆమెతో 20 ఏళ్లు గడిపినా కూడా ప్రేమ తగ్గకూడదు. ఎప్పుడూ ఒకరికొకరు గౌరవించుకోవాలి. వయసు పెరిగే కొద్దీ మనుషుల్లో మార్పులు సహజం. 25, 30 ఏళ్ల వయసులో ఉండే ఆలోచనలు, ప్రాధాన్యతలు తర్వాత మారిపోతాయి. జీవితం ఎలా ఉన్నా.. మన భాగస్వామిపై ఉండే ప్రేమ, ఆప్యాయత మాత్రం ఎప్పటికీ మారకూడదని చెప్పారు. సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్రను, వారి త్యాగాలను సూర్య ప్రస్తావించారు. 'ప్రతి కుటుంబంలో పురుషుడి కంటే మహిళలు ఎక్కువ కష్టపడతారు. ఇల్లు చూసుకోవడం, పిల్లలకు జన్మనివ్వడం వంటి విషయాల్లో వారు ఎన్నో త్యాగాలు, సర్దుబాట్లు చేస్తారు. వాటికి ఎప్పుడూ గౌరవం ఇవ్వాలి. ప్రేమ పంచడంతో పాటు వాళ్లకు గౌరవం ఇవ్వడమూ ముఖ్యమని సూర్య చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మమితా బైజుమాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి తనకు సూర్య అంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు. 'గతంలో సూర్యతో పనిచేసే మంచి అవకాశాన్ని కోల్పోయాను.

# అతీంద్రియ శక్తుల కథ...అగధ

### 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం




ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.

ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

# స్పైడర్ మ్యాన్ కెలక్షన్ల దూకుడు




టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ.11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ.310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.

# ఇరుముడి నుంచి యాలాలో..యాలాలో పాట విడుదల

### 21న విడుదలకు సిద్ధం అవుతున్న చిత్రం

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ




పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రీ?కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంది. తన కూతురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా మేకర్స్ తెరదించారు.